కథా నిలయం
శ్రీకాకుళం

# జడివాన

చెల్లెలు చనిపోయిందన్న కబురు చెవినబడగానే చంద్రయ్య ఒక గాఢమైన నిట్టూర్పు విడిచి "పుణ్యాత్మురాలు! ఆమెకు పరలోకంలో నైనా మనశ్శాంతి కలుగుగాక!" అనుకుంటూ కళ్ళనీళ్ళు బెట్టుకున్నాడు.

ఎవరినైతే ఈ లోకం కత్తులబోనులా బాధిస్తుందో, ఎవరికైతే బ్రతుకు హాలాహలం కంటే చేదవుతుందో, ఎవరైతే కనుచూపు ప్రసరించినంత మేరకు ఒక చిన్న ఆశాజ్యోతినైనా చూడలేరో అలాటి దీనమానవానీకంలో చంద్రయ్య చెల్లెలు కామాక్షమ్మ ఒక్కతె.

కామాక్షికి ఐదో ఏడు జరుగుతుండగా తల్లి చనిపోయింది. తండ్రి అంతకు మునుపే కళ్లుమూసుకున్నాడు. ఇక అన్నా, చెల్లెలు అప్పుడే ఇంట్లో కాలు మోపిన కొత్త కోడలు. ఈ ముగ్గురు మాత్రం పెద్ద దిక్కులేకుండా మిగిలారు. చంద్రయ్య భార్య అలిమేలమ్మ కప్పటికి పదహారేళ్ళేయినా నిండలేదు. ఆమెకు కామాక్షి పలుకు తోడులా కనిపించింది. స్నేహితురాల్లా కనిపించింది. ఆపైన చనువెక్కువ కానూకానూ తోబుట్టువులా కనిపించింది. ఆ ఇద్దరి మధ్య వదినెకు, ఇంటి ఆడబిడ్డకు మధ్య వుండవలసిన పొరపొచ్చలేవీ వుండేవి కావు. కామాక్షి వదినెని 'అక్కయ్యా' అని పిలుస్తుంటే అందరికీ చాలా విడ్డూరంగా వుండేది. "అదేమిటే! వదినెని పట్టుకుని అక్కా అంటావు" అని ఎవరైనా అడిగితే అలిమేలు కలగజేసుకుని 'మీరూరుకోండయ్యా! నోరు జారి ఆవిడ 'వదినా' అనసాగిందంటే అక్షణాన్నుంచీ మాయిద్దరి మధ్యా వదినా ఆడబిడ్డల కొట్లాటలు ప్రారంభమై పొయ్యేను! ఇప్పుడక్కయ్యా అని పిలుస్తోంది కాబట్టి ఈ సంసారం సాఫీగా సాగిపోతోంది" అని కామాక్షిని చూచి "ఏమమ్మా మరదలా; ఇంత నోరులేని బిడ్డవి నువ్వెలా సంసారం నిలబెడతావో మరి! వదిన అన్న బిరుదంతో నేనొక్క దాన్ని ఇంట్లో వున్నానని తెలిసి తెలిసీ సాధింపులు, మూతి బిగింపులు ఏమీ లేకపోతే ఎలాగమ్మా" అంటూ నవ్వేది.

పోవే అక్కయ్యా! నువ్వు మరీను!" అని కామాక్షి వదినతోబాటు నవ్వుతూ ఆమె కంఠాన్ని పట్టుకుని వేలాడబోయేది. అవన్నీ గడచిపోయిన రోజులు!

చంద్రయ్య దేమంత జరిగిన సంసారం కాదు. పైన వానలుకురిసి, చుట్టు ప్రక్కల చెరువులు నిండి ఏటిలో వూట పుట్టితేగానీ అతడి నాలుగెకరాల చవిటి నేల ఫలించదు. అప్పుడు ఫలించినా కాపురానికారునెతల్లల భత్యమైనా సమకూరడం సందేహమే! పైగా చంద్రయ్య మేడి చేతబట్టి, కాడెద్దుల్ని అదిలిస్తూ మండుటెండల్లో శ్రమించడానికి అలవాటు పడకుండా చిన్నప్పటి నుంచీ సుకుమారంగా పెరిగిన మనిషి కష్టపడి పరమాన్నం తినడం కన్నా కాళ్ళు బారిగిల చాపుకుని కడుపుపైన తడిగుడ్డ పరచుకోడమెంతో హాయి అనుకునే మనస్తత్వమతడిది. 'అదేమిటి చంద్రయ్యా! పట్టుమని పదినిమిషాలైనా ఒళ్లువంచి పని చేయకపోతే ఈ సంసారమెలా జరుగుతుందనుకుంటున్నావ్' అని ఎవరైనా అడిగితే కష్టపడి నేను పోషించడానికి గంపెడు బలగమేముంది గనుక! మేమిద్దరం తినినా తినకపోయినా కాలం జరిగిపోతుంది. మా కామాక్షి పెళ్ళి గనుక సలక్షణంగా జరిగిపోతేనా, ఆపైన నా కెలాటి చింతావుండదు" అనేవాడు చంద్రయ్య.

కామాక్షికి పెళ్ళయిందనిపించడానికి చంద్రయ్య ఎంత వేగిర పడ్డాడో అంతకంత ఆలస్యం జరుగసాగింది. ఎన్నో సంబంధాలు చూచాడు. కొన్ని కుదిరినట్టే కుదిరి అంతలో బెడిసిపోయాయి. ఎక్కడికి పోయినా చంద్రయ్యకు కట్నాల సమస్య భీకరంగా ప్రత్యక్షం కాసాగింది. తన తాహతుకు తగినంత కట్నం ముట్ట జెప్పుకోడానికి చంద్రయ్య వెనుకాడలేదు. ఉన్న నాలుగెకరాల నేల తనఖా పెట్టితే రెండువేల రూపాయలు చేతికి రావచ్చు. ఆ రెండు వేలలో సాలంకృత కన్యాదానం తన యింట్లోనే జరుగవలసి వుంటుంది గనుక అందుకు వెయ్యి రూపాయలు పోనూ మిగతా వెయ్యి రూపాయలు కట్నం యివ్వడానికి అతడు పలుచోట్ల సంసిద్ధత ప్రకటించాడు.

ఈ వరులవేటలో సతమతమై పోతున్న చంద్రయ్యకు నిరుపేదకు నిధిలా ఒక పెళ్ళిళ్ళ పేరయ్య (విచిత్రం అతడి పేరు కూడా పేరయ్యే!) ప్రత్యక్షమయ్యాడు. అతని తోడ్పాటుతో ఒక సంబంధం కుదిరింది. కామాక్షికోసం అలాటి సంబంధం కాచుకుని వుంటుందని ఎవరూ ఊహించలేదు. వరుడు రెండో పెళ్ళివాడన్న లోపం ఒక్కటి మినహాయిస్తే మిగతా విషయాలన్నింటిలోనూ అది పేరయ్య చెప్పినట్టు 'రాజా సంబంధమే'.

నీలకంఠానికి మొదటి పెళ్ళి కాస్త చిన్న తనంలోనే జరిగింది. మొదటి భార్య ఏడెనిమిదేళ్ళు సంసారయాత్రచేసి, అంతటితో యిహలోక యాత్రనే చాలించింది. ఆ

భార్యకు ఈ మగడికీ మధ్యవుండిన దాంపత్యాన్ని గురించి చాలామంది యిప్పటికీ కొన్ని దురభిప్రాయాలు వెలిబుచ్చుతూ వుంటారు. మనవాడామెని రాచిరంపాన బెట్టని రోజు వుండేదికాదని, ఆ సాధ్వి కాబట్టి అతడితో ఏడెనిమిదేళ్లు కాపురం చేసింది. మరెవరైనా అయితే ఎన్నడో బారెడు తాడు వెదుక్కుని ఉండునని కొందరు చంద్రయ్యకు కుండబద్దలు కొట్టినటగ్లు చెప్పారు కూడా!

అవి నీలకంఠమంటే కిట్టనివాళ్లు వ్యాపింపజేస్తున్నపుకార్లని. పెళ్ళిళ్ల పేరయ్య వ్యాఖ్యానించాడు. ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని చంద్రయ్య గంగిరెద్దులా పేరయ్య చెప్పిట్టల్లా తలాడించాడు.

కడకు కామాక్షి కల్యాణం ఒక మాదిరిగా అయిందనిపించేశాడు చంద్రయ్య. పెళ్ళి ఎప్పటికప్పుడే ఆగిపోయే సందర్భాలు అనేకం తటస్థించాయి. ముఖ్యంగా కట్నం దగ్గర మడత పేచీ లేర్పడి పెళ్ళి పీటల పైకివచ్చిన తర్వాత కూడా భగ్నమయ్యే సూచనలు కనిపించాయి. పేచీల్ని సృష్టించడంలోనూ పరిష్కరించడంలోనూ పేరయ్య అత్యద్భుతమైన చాణక్య ప్రజ్ఞ ప్రదర్శించాడు. మొదట కట్నం మూడు వేలనీ, అంతకు తగ్గితే నీలకంఠం మాత్రం ఒప్పుకోడని చంద్రయ్యకు, చంద్రయ్య నెంతపీడించినా వెయ్యిరూపాయలకన్నా ఎక్కువ రాబడి అసాధ్యమని నీలకంఠానికి చెప్పిన పేరయ్య. కడకు యిద్దరి సమక్షంలో రెండు వేలకు బేరాన్ని పరిష్కరించాడు. ఆ రెండు వేలలో ఒక వెయ్యి మాత్రం చంద్రయ్య ముహూర్తానికి సరిపెట్టగలిగాడు. మిగతా పైకం ఒళ్ళో వుంచితేగాని మంగళసూత్రాన్ని పైకెత్తనన్నాడు నీలకంఠం. బంధువుల్లో ఇటు చంద్రయ్య వైపు కొందరు, అటు నీలకంఠం వైపు కొందరు విడిపోయి రగడ పెంచడానికి శాయశక్తులా తోడ్పడ్డారు. సోమవారం ఉదయాత్పూర్వం నాలుగున్నరకు జరుగవలసిన ముహూర్తం ఆరు, ఏడయినా పూర్తిగాక, పెళ్ళిపందిరి రచ్చబండగా మారి పోయింది. ఏడున్నరకు పైన రాహుకాలం వస్తుందని పురోహితుడు గోలపెట్టసాగేడు. ఏడు కొట్టిన తర్వాత పాతిక నిమిషాలకు పేరయ్య అప్పుడే తను వ్రాసి పూర్తిచేసిన వెయ్యి రూపాయల ప్రోనోటుపైన చంద్రయ్య సంతకం పెట్టించి, ఆ కాగితాన్ని పెళ్ళి కుమారుడికి సమర్పించి ముహూర్త మేళం కానివ్వమని మంగళ్ళకు సైగ చేశాడు. డోలు దణదణ మ్రోగింది. కామాక్షి మెడలో మంగళసూత్రం ముడిపడింది.

పెళ్ళయిన మరునాడుగానీ నీలకంఠానికి చంద్రయ్య ఆస్థి అంతా తాకట్టు క్రిందవుందనే విషయం తెలిసిరాలేదు. ఆ సంగతి కాస్తా తెలిసిన తర్వాత తన ప్రోనోటు

కుంకం గట్టుకోడానికి మినహా మరెందుకు పనికిరాదని అతడు గుర్తింపగలిగాడు. అప్పుడు కోపంతో అగ్గిరాముడై నీలకంఠం చంద్రయ్యనీ పేరయ్యనీ నోట్టికివచ్చినట్టల్లా తిట్టిపోశాడు. వాగ్దానం ప్రకారం డబ్బు తన చేతిలోపడితేగానీ తను కామాక్షి ముఖం చూడ్డంపొసగదని శపథంచేశాడు.

శపథం చేసిన నీలకంఠలో కూడా కొంచెం మనోదౌర్బల్యం లేకపోలేదు. ఆవ్వాకావాలి, బువ్వాకావాలి అన్నట్లు అతడికి భార్యా కావాలి, కట్నం కావాలి అనిపించింది. భార్యేమో కాపురానికి సిద్ధంగావుంది. కట్నం మాత్రం కరగతమయ్యే అవకాశం కనిపించడంలేదు. అతడాలోచించి ఆలోచించి మూడు నెలల్లో డబ్బు ముట్టకుంటే, భార్యని శాశ్వతంగా పుట్టింటికి పంపివేసే షరతుతో ఆమెను వెంటబెట్టుకొని స్వగ్రామం చేరుకున్నాడు.

మూడు నెలలు గడిచిపోయాయి. నాలుగోనెల జరుగుతుండగా చంద్రయ్య డబ్బుకోసం మరికొన్ని రోజులు ఆగమని ప్రాథేయ పడుతూ నీలకంఠానికి జాబు వ్రాసుకున్నాడు. ఆ జాబుతో మరి రెండునెలలు గడిచి పోయాయి. ఆ సంవత్సరం చంద్రయ్య నేల ప్రక్కన వున్న ఏటిలోని ఇసుకలా తెల్లబడిపోయి బ్రతికి చెడినవాడి బతుకులా నెరలు పడింది. అలిమేలు ఒకపూట తిండిచేసి దాని రెండుపూటలా భరకుపెట్టి తను మంచినీళ్ళతోనూ దేవదారు ఆకు తోనూ కాలం గడపడం నేర్చుకుంది. ఆ పరిస్థితిలో వెయ్యి రూపాయలు కాదుగదా, కనీసం ఒక పదిరూపాయలు అప్పు పుట్టడమే అరుదయిపోయింది. కామాక్షి అత్తగారింటి నుంచీ వారాని కొకజాబు పాశుపతాస్త్రంలా వచ్చి పడుతోంది. చింతతో కుమిలిపోతూ చంద్రయ్య చిక్కి సగమైపోయాడు.

నీలకంఠం తన బాకీ సవ్యంగా వసూలు కాగలదన్న ఆశ వదులుకుని కోర్టుకు పయనమయ్యాడు. కేసును కోర్టులో ఫైల్ చేయించాడు. చంద్రయ్యకు సమ్మన్ వెళ్ళింది బావ మరదు లిద్దరూ వాది ప్రతివాదులై బోనులో నిలిచారు. రామాయణం పైన ప్రమాణం చేసి వెయ్యి రూపాయలు రొక్కముగా తనకు బాకీ యిచ్చినటు నీలకంఠం చెప్పడం విని చంద్రయ్య నిజంగా ఆశ్చర్యపడ్డాడు. బాకీ యివ్వవలసిన మాటేమో నిజమేననీ, కానీ అది తను తీసుకున్న అప్పు మాత్రం కాదనీ, చెల్లెలి పెళ్ళి కట్నంలో అనుకున్న మేరకు రెండు వేలులో అప్పుడే ఇచ్చి వేసిన వెయ్యి రూపాయలు పోనూ, మిగతా డబ్బుకు ప్రోనోటు వ్రాసియివ్వవలసి వచ్చిందనీ చంద్రయ్య చెప్పుకున్నాడు. ప్రోనోటు వ్రాసిన

పేరయ్య, సాక్షులూ చంద్రయ్య మాటల్ని బలపరిచారు. అప్పు తీసుకోకపోవడం ఋజువవుతోంది కాబట్టీన్నీ. వ్రాసి యిచ్చిన ప్రోనోటు కట్నానికి సంబంధించింది కాబట్టీన్నీ అప్పు చెల్లించితీరాలని చంద్రయ్యని కోర్టువాళ్ళు నిర్బంధించడానికి వీల్లేదనీ న్యాయాధిపతి తీర్పు చెప్పాడు.

మేయబోయి మెడకు తగిలించుకున్నటైంది నీలకంఠంపని. అతడింటికి వెళ్ళి తన కోపాన్నంతా భార్యపైన చూపించాడు. "ఆ డబ్బు తెచ్చావా సరేసరి. లేకుంటే యింట్లో కాలు బెట్టడానికి వీల్లేదని ఆమెని మెడబట్టి బయటికి గెంటేశాడు. అప్పుడు కామాక్షి వట్టి మనిషి కాదు. నిండుచూలాలు. అమ్మగారింటికి వెళ్ళి కట్నం చెల్లించమని అన్నయ్యని పీడించడానికి ఆమెకు మనసొప్పలేదు. అప్పటికి అర్ధరాత్రి దాటివుంటుంది. కొట్టినాసరే, కోసినాసరే అనుకుని ఆమె ఆ రాత్రి అరుగు పైన్నే పడుకుంది. తెల్లవారు జామున అప్పుడు నీలకంఠం తలుపు తెరిచాడు. కామాక్షి లేచి ఇంట్లోకి వెళ్ళింది.

ఈ ఉదంతం చంద్రయ్యకి తెలియడానికి ఎంతోకాలం పట్టలేదు. నీలకంఠమంటే కిట్టని వాళ్ళెవరో అతనికి జాబు వ్రాశారు. జాబును భార్యకు చదివివినిపించి "నాచెల్లెలు గుండెలో బాకుదింపేశానే అలిమేలూ!" అని చంద్రయ్య ఆక్రోశించాడు.

అలిమేలు హృదయం తరుక్కుపోయింది. ఆమెకు బిడ్డలులేరు. మరదలైనా, తోబుట్టువైనా కూతురైనా ఆమెకు కామాక్షే; కామాక్షే ఆమెకు సర్వస్వం. అలాంటి నిండు గర్భంతోవున్న తన మరదలు నానాయాతనలకు గురౌతోందని తెలిసిన తర్వాత అలిమేలు అన్నం ముట్టడం మానేసింది. అందువల్ల "మన సంసారం నామారూపాల్లేకుండా నాశనమైపోయినా నాకిష్టమే! ఈ యింటిని తెగనమ్మండి. ఆ నేలను అమ్మకానికి పెట్టండి. వెయ్యిరూపాయలు చేతికి రాకపోవు. ఆపైన మనపాలిట ఆ పరంధాముడేవున్నాడు. మీరూ నేనూ ఎలాగైనా బ్రతగ్గలం" అని భర్త చెవిలో ఇల్లుకట్టుకొని కోరింది.

చంద్రయ్య భార్య చెప్పినట్లు చేశాడు. కానీ అంతలోనే ఎంత దారుణం జరగాలో అంత దారుణమూ జరిగిపోయింది.

కామాక్షికి పనసపండులాంటి మగబిడ్డ పుట్టాడు. పచ్చిబాలెంతరాలైనప్పటికీ ఆమెకింటి పనులు చేయక తప్పలేదు. "చల్లనీళ్ళల్లో చెయ్యి బెట్టగూడదే అమ్మాయి" అని యిరుగు పొరుగు అమ్మలక్కలు హెచ్చరించినా కామాక్షి లెక్కపెట్టలేదు. తన కెన్ని కష్టాలు రావాలో అన్నీవచ్చాయి. ఇకపైన ఏంరాబోతుంది? ఈ ధైర్యంతో ఆమె మామూలుగా వంటా వార్పు చేసుకోసాగింది. పురుడు పదికొండోరోజున తీరబోతోందనగా నాలుగు

రోజులు ముందుగా ఒకనాటి సాయంత్రం తల భారంగా తోచి ఆమె వట్టినేల పైన్నే మేనువాల్చింది. ఆ రాత్రి జ్వరం ఒళ్లు తెలియకుండా కాచింది. మరునాటి సాయంత్రానికి జన్నితగిలింది. ఆ మరునాటి వుదయం కామాక్షి జీవిత నాటకంలో కడపటి అంకం ముగిసి యవనిక క్రిందికి వ్రాలింది.

డబ్బు జేబులో వుంచుకొని బస్సుదిగిన చంద్రయ్యకు చెల్లెలు చనిపోయిందన్నవార్త చెవినిపడింది.

2

ఆరోజు సాయంత్రం ఊరికి వుత్తరాన వల్లకాటిలో చెల్లెలు చితిపైనుంచీ మెల్లగా పైకెగురుతున్న ధూమాన్ని చూస్తూ కానుగ చెట్టు కింద కూర్చున్నాడు చంద్రయ్య

ఆమె, తన చెల్లెలు కామాక్షి, ఆచితిలో ఆ చింతకట్టెల కింద రంగులుకుంటున్న అగ్ని జ్వాలల్లో కాలి బూడిదైపోతోంది. తల్లి చనిపోతూ కామాక్షిని తన కప్పగించి ఇక దీనికి అన్నయినా, తండ్రియినా నువ్వే నన్నది. తనామెను సాకి సంతరించి చేసిన నిరవాకం యిది!

చంద్రయ్య కళ్ళలో నీళ్లు తిరగాయ్ అతడి హృదయంలో అగ్ని పర్వతం పేలింది.

తన చెల్లిలి బ్రతుకు ఆకులురాలని పూవులు వాడని నందనమౌతుందనే ఆశతోగదా తనామెని ఈ నీలకంఠానికిచ్చి అగ్ని సాక్షిగా పెళ్ళిచేసింది. ఈ దౌర్భాగ్యుడేం చేశాడు? అమెనొక క్రిమిలా కీటకంలా చూచాడు, తిట్టాడు. కొట్టాడు. ఏం, ఇతడేం తిండికి గతిలేని దరిద్రుడా! కుంటక్రింద ఓపినంత భూమివుంది. పదివేలరూపాయల వడ్డీ వ్యాపారముంది. ఈనాడు కట్నం ముట్టకపోతే ఇతిడికేం బ్రతుకేలేదా? ఐనా తనేం పైకాన్ని యింట్లో పూడ్చి పెట్టుకుని యివ్వడానికి నిరాకరించలేదే? తనకే సంసారం గడవడం లేదు. అప్పు యిచ్చే వాళ్ళు అంతకుముందే కనిపించలేదు. తనలాంటి దరిద్రుడికి ఎక్కడి నుంచి వస్తుంది డబ్బు? కాని తనెప్పుడైనా, ఎలాగైనా ఆ డబ్బుతనికి పువ్వులోపెట్టి ముట్టజెప్పాలనే వుద్దేశంతోనే వున్నాడు. ఇంతలో యింతటి దురాగతమా! ఇతణ్ణి మానవుడని అనుకోడం మానవజాతికి ఆపచారం చేసినట్టు కదా! ఇతడు ప్రాణం లేని డబ్బుని చూచాడు. ప్రాణం కలిగి, డబ్బు కన్న లక్ష రెట్లెక్కువైన తన అర్ధాంగి నూరేండ్లనిండు జీవితాన్ని చూడలేక పోయాడు. ఇతన్నేంచేసినా పాపం లేదు "ఓయీ నీలకంఠం! నాలో ప్రవహించేది రక్తమే అయి బురదనీరు కాకపోతే నీకు తగిన శాస్తి చేసి తీరుతాను. చెల్లీ కామాక్షీ! నీ సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఈ నీచుడికి శాస్తి చేసేదాకా నిదురపోను" అనుకున్నాడు చంద్రయ్య.

కామాక్షి నామమాత్రావశిష్టు రాలైపోతూ పోతూ ఈలోకంలో తనకు ప్రతిబింబంగా చక్రపాణిని విడిచి చక్కాపోయింది. ముక్కు పచ్చలారని ఆ పసికందును చంద్రయ్య చేతుల్లోకి తీసుకుని అలిమేలు ఒళ్లో పండబెట్టాడు. తన కుమారున్ని చంద్రయ్య పెంపకాని కప్పగించడం వల్ల నీలకంఠానికి రెండు మూడు అనుకూలాలు కనిపించాయి. ఒకటి తను మూడో పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించడానికి ఎలాంటి ఆటంకమూ వుండదు. రెండు, రాబోయే క్రొత్త భార్యకు కొంచెం శ్రమ తగ్గించినట్లవుతుంది. అమెకూ, తనకూ మధ్య ఇంట్లో ఒక పసివాడుండడం అనేకవిధాల ఆక్షేపకరమైన విషయం! మూడు, ఖర్చు కూడా తగ్గినట్టవుతుంది. పైగా తన ఖాతాలో చంద్రయ్య వెయ్యి రూపాయలు జమకట్టి వేశాడుకూడా! అతడు బిడ్డనెత్తుకుని వెళ్ళి పెంచి పెద్ద చేస్తానంటే తనెందుకు వద్దనాలి ఎవడికోసం చేస్తాడు? అతడి చెల్లిలి బిడ్డేగా!

3

కాలచక్రం గిర్రున తిరిగింది. ఏదెనిమి దేళ్ళు గడిచిపోయాయి. చక్రపాణి చంద్రయ్య దగ్గరేవుండి స్కూలుకువెళ్ళి చదువుకోసాగాడు. ఈ లోపల నీలకంఠం జీవితంలో కూడా కొన్ని మార్పులొచ్చాయి. బ్రహ్మప్రయత్నంమీద మూడోపెళ్ళి కుదిరింది. ఈ సారి పెళ్ళికూతురి తల్లిదండ్రులకే 'ఓళి' అన్న పేరుతో నీలకంఠం కొంత డబ్బు చెల్లించుకోవలసివచ్చింది. కొత్త భార్య కొంతవరకూ చదువుకొని, ఆ చదువుల్లోని పాఠాల్ని గాక చదువుకున్నాంగదా అన్న అహభావాన్ని ఒంటినిండా పట్టించుకున్న మనిషి. పెళ్ళిచేసుకున్నప్పటికీ స్త్రీలు స్వేచ్ఛావిహారం నిషేధం కానక్కర్లేదన్న మహత్తర సత్యాన్ని ప్రపంచానికి నిరూపించడానికా అన్నట్లు ఆమె నీలకంఠాన్ని పెళ్ళాడింది. కానీ ఆమె బుడబడికలు నీలకంఠం దగ్గర బొత్తిగా సాగలేక పోయాయి. అతడు మూడోభార్య పట్ల తన మామూలు పంథాని మార్చుకోలేకపోయాడు. అందుచేత భార్యభర్తల మధ్య రామరావణ సంగ్రామాలు చెలరేగాయి. కడకు నీలకంఠం సాహసించి భార్యమీద చెయ్యి జేసుకున్నాడు. ఆమె రచ్చపై కెక్కి భర్తపైన లక్ష శాపనార్థాలు కుమ్మరించి మిట్టమధ్యాహ్నం బస్సెక్కి పుట్టిల్లు చేరుకుంది. "బ్రతికానురా దేవుడా" అని నీలకంఠం మంచంపైన చతికిల పడిపోయాడు.

గడిచిన ఐదారేళ్ళ పొడుగునా నీలకంఠం చంద్రయ్యకు సంవత్సరానికి కొకటి రెండు చొప్పున జాబులు వ్రాశాడు. వ్రాసిన ప్రతి జాబుకు చక్రపాణి క్షేమంగా వున్నాడని బదులొచ్చింది. ఒకసారి వాడిని తన దగ్గరికి పంపిస్తే పదిరోజులుంచుకుని పంపిస్తానని

నీలకంఠం జాబు వ్రాశాడు. ఆ జాబుకు మాత్రం చంద్రయ్య దగ్గరనుంచి బదులు రాలేదు.

4

"తల్లికిమించిన దైవము లేదంటే ఏమిటి మామయ్యా?" గ్రుడ్డిదీపం వెలుగులో తెలుగు పాఠం చదువుతున్న చక్రపాణి వున్నట్టుండి తలపైకెత్తి చంద్రయ్యని ప్రశ్నించాడు.

చదువుకుంటున్న కుర్రాణ్ణి దగ్గరకు తీసుకుని చంద్రయ్య "ఇలాటి ప్రశ్నకోసం రెండు మూడేళ్ళనుంచీ నిరీక్షిస్తున్నానురా బాబూ" అన్నాడు.

చంద్రయ్య ఏ మంటున్నాడో తెలియక కుర్రాడు "ఏమిటి మామయ్యా నువ్వనేది?" అని మళ్ళీ ప్రశ్నించాడు. చెబుతా విను. ఇప్పుడు నువ్వున్నావు. నేనున్నాను. ఈ ప్రపంచంలో ఎందరోవున్నారు. మనల్ని నవమాసాలు మోస్తుంది. మనం ముక్కుతూ, మూలుగుతూ పడుకుంటే నిద్రాహారాలు మాని మనకు శుశ్రూషచేస్తుంది మనం నవ్వితే తన కేదో నిక్షేపం దొరికినట్టు మురిసి పోతుంది. మనం ఏడిస్తే కుమిలిపోతుంది ఏ దైవం మాత్రం మనల్నింతకంటే కనిపెట్టుకుని వుంటుంది చెప్పు! అందుకే పెద్దలేమన్నారు? తల్లికి మించిన దైవం లేదన్నారు"

"నువ్వెప్పుడైనా మీ అమ్మని చూచావా మామయ్యా?" చక్రపాణి అమాయకంగా ప్రశ్నించాడు.

"చూడకేం బాబూ! బాగా చూచాను. కాళ్ళకు పెనవేసుకుని పాలివ్వమని మారం చేశాను చందమామని చూపిస్తూ పాల బువ్వ తినిపించమని హఠం చేశాను. మా అమ్మ నాకు నీళ్ళుపోసి ఉతికిన గుడ్డలు తొడిగి తలదువ్వి స్కూలుకి పంపించేది. మానాన్నకు తెలియకుండా అణా, అర్ధణా యిచ్చి ఏమైనా కొనుక్కోమనేది. మా అమ్మ ఎంతమంచి దనుకున్నావు చక్రపాణి! అందుకే నే నిప్పటికీ మా అమ్మని పూజిస్తుంటాను".

"అయితే మా అమ్మ మాత్రం నాకెప్పుడూ కనిపించలేదేం మామయ్యా?" చక్రపాణి దీనంగా అడిగాడు.

చంద్రయ్య కుర్రాణ్ణి మరింత దగ్గరికి తీసుకుని, తల నిమురుతూ "నువ్వు కళ్ళు తెరవడానికి ముందే మీఅమ్మ చనిపోయిందిరా బాబూ! కాదు. అమేం ముసలిదా. ముతకదా చనిపోవడానికి? ఆమెని చంపేశారు" అన్నాడు.

"ఎవరు మామయ్యా చంపేసింది?" చక్రపాణి భయపడుతూ అడిగాడు.

"మీ నాన్నగారు! ఒరేబాబూ! ఓ రోజున మీ నాన్న మీ అమ్మని కొట్టి ఇంటిలో నుంచి వెళ్ళిపొమ్మన్నాడు. అర్ధరాత్రివేళ చీకట్లో మీ అమ్మ ఎక్కడికి వెళ్తుంది? ఏడుస్తూ

అలాగే నిలబడి పోయింది. "ఈ సిగ్గుమాలిన బ్రతుక్కంటే ఎక్కడైనా దూకి చావరాదూ!" అని అతడు మీ అమ్మని మెడబట్టి ఇంట్లో నుంచి బయటికి గెంటేశాడు. ఆమె రాత్రంతా అరుగు పైన్నే పడుకుని కాలం వెళ్ళబుచ్చింది. చలిగాలి రివ్వురివ్వున వీస్తోంది దెబ్బలతో ఒళ్ళంతా కమిలిపోయి నొప్పెట్టుతోంది. కప్పుకోడానికి గుడ్డయినా లేదు. అప్పుడు నువ్వింకా మీ అమ్మ కడుపులోనే వున్నావు. చలికి గజగజవణికిపోతూ మీ అమ్మ పైట చెరగుతో చెవులు మూసుకుంది"

"అలాగే మా అమ్మ చచ్చిపోయిందా మామయ్యా?"

"లేదు మళ్ళీ బ్రతికింది! తెల్లవారుజామున మీ నాన్న తలుపు తీయగానే లోపలి కెళ్ళింది. తరువాత కొద్ది రోజుల కామెకు కడుపునొప్పులొచ్చాయి. మీ నాన్న మంత్రసానికోసం కబురైనా పంపాడుకాదు. ఒక పగలు, ఒక రాత్రి పడరాని బాధపడింది. నువ్వు పుట్టావు.పచ్చి బాలెంతరాల నైనా చూడకుండా మీ నాన్న ఆమెచేత నీళ్ళు తోడించాడు. ఇల్లలికించాడు. వంటచేయించాడు. ఓ రోజు సాయంత్రం ఆమె తలనొప్పిని పడుకుంది ఇరుగు పొరుగు వారు జాలిపడి "వైద్యుణ్ణి రమ్మని కబురు పంపవయ్యా నీలకంఠం!" అన్నారు. "అనవసరమైన జోక్యాలు మీ కెందుకు? ఇక్కడెవరికీ ప్రాణాప్రాయం లేదు. మీ పాటుకు మీరుండకూడదూ" అని మీనాన్న వాళ్ళని కసిరికొట్టాడు. మీ అమ్మ కారాత్రే జ్వరం వచ్చింది. మరునాటికి జన్ని తగిలింది. అంత జన్నిలోనూ నీకు పాలివ్వడానికి తహ తహ పడింది ఏడ్చింది. ఏడ్చి, ఏడ్చి చచ్చిపోయింది.

ఏదో ఆవేశం పూనిన వాడిలా చెప్పుకుంటూ పోతున్న చంద్రయ్య అక్కడ ఆగి వెక్కి వెక్కి ఏడుస్తున్న కుర్రాణ్ణి ప్రక్కన పడుకోబెట్టుకుని కళ్ళు దుడుస్తూ "నా బాబువి కదూ! ఊరుకో నాయనా! మీ అమ్మ లేక పోతేనేం! నే నున్నానుగా. మీ అత్తయ్య వుందిగా" అని సముదాయించాడు.

మళ్ళీ రెండేళ్ళుగడిచి పోయాయి. చక్రపాణి మూడో తరగతినుంచి నాలుగో తరగతి కొచ్చాడు.

అదే గ్రుడ్డిదీపపు వెలుగు ఈసారి రైతులకు భూములకు సంబంధించిన పాఠం చదువుతూ వుండి వున్నట్టుండి చక్రపాణి తలపైకెత్తి మామయ్యవైపు చూచాడు.

"ఏంరా! మరికొంత సేపు చదువరాదూ!" అన్నాడు చంద్రయ్య. ఆదికాదు మామయ్యా! రైతులేకపోతే రాజ్యమే లేదని యిక్కడ వ్రాశారు. "రైతు లేకపోతే మాత్రం రాజ్యమెక్కడికి పోతుంది మామయ్యా!" అని ప్రశ్నించాడు చక్రపాణి.

చంద్రయ్య నవ్వి, రాజ్యమంటే ఏమిటి బాబూ! అని అడిగాడు. చక్రపాణి కొంచెం ఆలోచించి "రాజ్యమంటే దేశంకదూ మామయ్యా!" అన్నాడు.

"దేశమంటే ఏమిటి?"

"దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని వ్రాశారు మామయ్యా మా బడి గోడమీద"

"చూచావూ! దేశమంటే మనుషులన్న మాట! మనమందరము మనుషులమే ఇప్పుడు చెప్పు మనమందరమూ ఎలా బ్రతుకుతున్నాము?"

"అన్నం తిని"

"ఆ అన్నం ఎక్కడినుంచి వస్తోంది?"

"రైతులు పంటలు పండిస్తారు మిగతా వాళ్ళు వాళ్ళదగ్గర కొనుక్కుంటారు"

"రైతులు పంటలు పండించకపోతే?"

"............" "చెప్పుమరి అప్పుడు మన నాయకులు మన ఉద్యోగులు వీళ్ళందరూ ఏమౌతారు?" "పస్తులు మాడారు" "పస్తులు మాడి?"

"తెలిసిందిలే మామయ్యా! ఇంక చదువుకుంటాను" చక్రపాణి మళ్ళీ పుస్తకంపైకి చూపులు పోనిచ్చాడు.

కానీ చంద్రయ్య దొరికిన అవకాశం జారవిడుచుకోలేకపోయాడు.

"ఒరే బాబూ! రేపు చదువుకోవచ్చుగానీ, ఓ మాటిలారా"

"ఏం మామయ్యా!" అంటూ చక్రపాణి మంచం దగ్గరికెళ్ళాడు.

"ఆ రైతుల్ని కలిగిన మహారాజులు ఎలా బాధిస్తారో తెలుసా?"

"బాధిస్తారా మామయ్యా? ఎందుకూ?"

"చెబుతా కూచో ఎవరిసంగతో ఎందుకు? మీ నాన్న వున్నాడు. ఆయనగారి ధర్మాన ఏడెనిమిది మంది రైతులు కొంపాగోడీ వదులుకుని ఇప్పుడు బస్తీలో రిక్షాల్లాగి బ్రతుకుతున్నారు ఒకప్పుడు మీ నాన్నగారికి కుంటక్రింద పదెకరాల నేలమాత్రం చెల్లా చెదరుగా వుండేది. కుంటక్రింద నేలంతా ఏకంగా తనకే వుంటే బాగుండు ననిపించిందాయనకు రైతులకు అప్పులిచ్చాడు. వడ్డీలకు వడ్డీ లెక్కవేశాడు. నూరు రూపాయల నగని ఇరవైకి ముప్ఫయికి తాకట్టు పెట్టుకున్నాడు. వాయిదా పోయిందని నగని కరిగించి బంగారు చేసుకుని రైతుల్ని మీకెక్కడ దిక్కుంటే అక్కడచెప్పుకోండి - అని గదమాయించాడు నిల్చున్న పాళాన అప్పులు చెల్లించమని. నోటిసిచ్చాడు వాళ్ళని కోర్టుకి త్రిప్పించాడు. బాకీలు డిక్రీచేయించి. రైతుల భూముల్ని వేలం వేయించి వేలంలో

సరసంగా కొనేశాడు. అన్నమో రామచంద్రా అని అల్లాడిపోతూ ఆ రైతులు పెళ్లాంబిడ్డలతో సహాబస్తీకి వెళ్ళిపోయారు. అక్కడ దేహంలో శక్తివున్న వాళ్ళు రిక్షాలు లాగుతున్నారు. మిగతావాళ్ళు బస్సుస్టాండు బూడిదదుమ్ములో పాదాలకు కలమంద మట్టలు కట్టుకుని మూటలు మోస్తున్నారు. ఒరే బాబూ! మీ నాన్న మనిషిని చూడదు. డబ్బును చూసాడు. డబ్బుకోసమే అతడు అన్నెం పున్నెం ఎరుగని అమాయకుల్ని మల్లగులాలుపెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగించాడు. డబ్బుకోసం అతడు కావలిస్తే మనుషుల్ని జలగలా రక్తం పీల్చి పాములా కాటువేసి, చెఱకు గానుగలా పీల్చి పిప్పిచేస్తాడు".

చక్రపాణి విన్నాడు. అనిమిషనేత్రాలతో చంద్రయ్యని చూస్తూ, కదిలీ మెదలకుండా వినివింటూ కొయ్యబారి పోయాడు. అతడి ముఖాన విస్మయం. భయం, కోసం ఆసహ్యా కలగా పులగంగా చిందులు త్రొక్కాయి.

"ఒకసారి ఇలా వస్తావా అలిమేలూ వంటగదిలో ఉన్న భార్యని చంద్రయ్య పిలిచాడు.

"ఏమండీ"! నడవలోకి వచ్చి, పిప్పెరమిట్ల డబ్బా తెరచి చూచుకుంటున్న భర్తనిచూచి విస్తుపోతూ "ఎందుకండీ అన్ని తెచ్చారు?" అంది.

"పిప్పరమిట్లేకాదు. కొత్తదుస్తులు కూడా తెచ్చాను" అంటూ చంద్రయ్య తలగడ క్రింద నుంచి ఒక క్రొత్త ట్రౌజరునీ, చొక్కానీ పైకితీశాడు.

"నాకు చెప్పనైనా చెప్పలేదేమండీ ఎప్పుడు తెచ్చారు?" అంటూ అలిమేలు గుడ్డల్ని మడతబెట్టి పెట్టెలో దాచబోయింది.

"ఇదిగో అలిమేలూ; నేను దుస్తులు తెచ్చింది నువ్వు పెట్టెలో దాచి నీ అల్లుడికి తొడగడానిక్కాదు" అంటూ చంద్రయ్య గుడ్డల్ని తీసుకుని మళ్ళీ మంచంపైన్నే వేశాడు.

"ఇంకెందుకండీ యివి కుఱ్ఱాడికి కాకపోతే" అలిమేలు ఆశ్చర్యంగా అడిగింది.

"ఒక చిన్న పరీక్ష చేయబోతున్నాను" "పరీక్షా"

"అవును, ఎందుకు ఎవరికి అవి అడక్కు నువ్వు నేను చెప్పినట్టుచెయ్, చక్రపాణి వీధిలో ఎక్కడో వున్నట్టున్నాడు. నువ్వు వాణ్ని పిలిచి ఈ కొత్తబట్టలు, పిప్పరమిట్లు నీకు మీనాన్న పంపించాడని చెప్పాలి?"

"ఎందుకండీ అబద్ధం చెప్పడం?"

"ఎందుకో తరువాత చెబుతాలే. నువ్వు కుఱ్ఱాణ్ని పిలువు. నేనంతవరకూ ఈగదిలోనే వుంటాను" చంద్రయ్య గదిలోకివెళ్ళి తలుపు మూసుకున్నాడు.

అలిమేలు వీధిలోకి వెళ్ళి కుర్రాణ్ని కేకవేసింది. చక్రపాణి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఇలా మంచంపైన కూచో చక్రపాణి. ఈ బట్టలు నీకు సరిపోతాయేమో చూడు" అంది అలిమేలు.

"చాలా బాగున్నాయత్తయ్యా! నా గుడ్డలన్నీ చిరిగి పోయాయి. మామయ్య నడుగుదామనుకున్నాను అడక్కముందే తెచ్చేశాడు ఇవేమిటి ఈ పిప్పరమిట్లుకూడా మామయ్యే తెచ్చాడా అత్తయ్యా?"

"లేదురా బాబూ! మనకంత డబ్బెక్కడిది? వీటిని మీ నాన్నగారు పంపించారు

చక్రపాణి ఒక్క క్షణంసేపు అలిమేలు ముఖం చూచి 'ఇవి నాకొద్దు' అంటూ గుడ్డల్ని విసిరి వీధిలో గిరివాటు కొట్టాడు.

"అదేమిట్రా చక్రపాణి! గుడ్డలేం చేశాయిరా నిన్ను? అలా పారవేస్తావెందుకు?" అలిమేలు విస్మయంతో అడిగింది.

నీకు తెలియదత్తమా! మా నాన్నా మా అమ్మని చంపేశాడు రైతుల్ని నానా బాధలు పెట్టి ఊరునుంచి తరిమేశాడు. పిప్పరమిట్లుని జలదారిగుంతలో పారబోయ్ నా కొద్దు" చక్రపాణి వీధిలోకి పారిపోయాడు.

"ఏమిటండీ! కుర్రాణ్ణి ఇలా చేసేశారు! తలుపు తెరచుకుని ఈవలికి వచ్చిన చంద్రయ్యని చూస్తూ అడిగింది. అలిమేలు.

"ప్రతీకారం చేయబోతున్నాను అలిమేలూ ప్రతీకారం" అంటూ చంద్రయ్య వికటంగా పెంకు లెగిరిపోయేట్లు నవ్వసాగాడు. భర్త ఆ విధంగా నవ్వగలడని అలిమేలు ఎప్పుడూ ఊహించనైనా లేదు. ఆమె చంద్రయ్యని ఆశ్చర్యంగా చూస్తూ విగ్రహంలా నిలుచుండి పోయింది.

## 6

కాలపురుషుని మహారథం సంవత్సరాల మైలురాళ్ళని పదింటిని దాటి ముందుకు పరితెంచింది. ఆ పదేళ్ళు నీలకంఠంపైన ఇరవై ఏళ్ళులా పనిచేశాయి అతడి ముఖం ముడుతలు పడింది. తల నెరసింది. కళ్లు లోపలికి పోయాయి. యౌవనంలో ఎప్పుడో ఒకప్పుడు కనిపించి మాయమై పోయిన దగ్గు, ఇప్పుడెక్కడ సందు దొరికిందో గానీ వెలు కుబికి శరీరాన్ని చిత్తుసేయసాగింది.

నీలకంఠం మంచంపైన్నుంచీ లేవడం లేదు. శరీరం మాత్రం పరుపు పైన్నే పడివుంటుంది. మనసులో మాత్రం అక్కడేదో పెద్ద పెద్ద మరలు పని చేస్తున్నంత గందరగోళంగా వుంది.

నీలకంఠం చంద్రయ్య కెన్నో జాబులు రాశాడు. కడపటి రోజుల్లో ఉత్తరాలకు ప్రత్యుత్తరాలు రావడం అరుదైపోయింది. చంద్రయ్య నిర్లక్ష్యాన్ని తలచుకున్నప్పుడు నీలకంఠానికి ఒళ్ళు మండేది. ఒళ్ళు మండినప్పుడల్లా నీలకంఠం కాగితం తీసుకొని చంద్రయ్యకు జాబు వ్రాయడాని కూచునేవాడు "నాకు నా కుమారుణ్ణి కానీకుండా చేసిన పాపం నిన్ను కట్టికుడుపుతుంది. నువ్వు నా కొడుక్కు మాయమందు పెట్టి మనసు మార్చివుంటావు అసలు నువ్వెప్పుడైతే బంధురీత్యా నా యింట్లో కాలు బెట్టావో అప్పుడే నా యింటిమీద గ్రుడ్లగూబ వ్రాలింది" ఇలా సాగేవి ఉత్తరాలు.

తన వుత్తరాలు చంద్రయ్యపైన ఎలాటి ప్రభావాన్ని చూపిస్తున్నాయో నీలకంఠం ఊహించలేకపోయేవాడు. వాటి నతడు చింపిగాలిలో ఎరుగవేస్తున్నాడేమో! ఇంక తనేం చేయాలి? ఎవరో దూరపు బంధువు ఒకావిడ వేళ కింత వండిపడేస్తోంది. ఆమె కూడా వెళ్ళిపోతే తన గతేం కావాలి? చేతికెదిగిన కొడుకు తన చెప్పు చేతల్లో వుండక పరుల పంచలో పడివుంటే తనింకా చూస్తూ వూరుకోడం భావ్యమేనా?

నీలకంఠం లేచి కూచుని వ్రాయడానికి ఓపిక చాలక, వ్రాతకోతల్లో ఆ ప్రాంతాన్ని కంతా సుప్రసిద్ధుడైన వ్యక్తిని పిలిపించి మూడు ఠావుల నిండుగా ఒక సుదీర్ఘమైన వుత్తరం వ్రాయించి దాన్ని కుమారుడి పేరుకే పోస్టు చేయించాడు.

ఆ వుత్తరంవల్ల కూడా ప్రయోజనం కలుగుతుందని నీలకంఠం అనుకోలేదు కానీ ఆవుత్తరం వల్ల అత్యద్భుతమైన ఫలితం చేకూరింది అది చేరిన నాలుగు రోజుల్లో చక్రపాణి తండ్రిని చూడ్డాని కొచ్చాడు.

ఆఖరుకు తండ్రీ కొడుకు లిద్దరూ కలుసుకున్నారు!

మంచం ప్రక్కన కుర్చీలో కూచుని, కూచున్న తర్వాత అయిదు నిమిషాలకు కొడుకు "నేను చక్రపాణిని!" అన్నాడు.

"తెలుసు, తెలుసు" అన్నాడు నీలకంఠం.

"నే నెప్పుడూ యిక్కడికి వచ్చినట్లు జ్ఞాపకం లేదు" అన్నాడు చక్రపాణి

"నువ్వు రాలేదు నువ్వెలావుంటావో నా కింతవరకూ తెలియనూ తెలియదు. కానీ నిన్ను చూడగానే నువ్వెవరో తెలుసుకో గలిగాను ఇరవై ఏళ్ళ ఈడప్పుడు నేను నువ్విప్పుడెలా వున్నావో సరిగ్గా అలా వుండేవాణ్ణి"

"... ... ..."

"ఐతే నీ కింత కాలానికి దారి కనిపించిందన్నమాట!"

"నే నిన్ని రోజుల్లో యిక్కడికి రాంది దారి కనిపించక కాదు".

"మరెందుకు?" "అవసరం లేక పోయింది"

"ఇప్పుడవసరం కలిగింది కదూ!"

"అవును" "మరేమిటి?"

చక్రపాణి చరాలున కుర్చీలోనుంచీ లేచి నిలబడి "నేను పగ తీర్చుకోడాని కొచ్చాను" అన్నాడు.

"నువ్వేం చేయలేదు? కాలం గడచిపోయినంతమాత్రాన మనం ఒకప్పుడు చేసిన దుష్కార్యాలు ఊరికేపోవు. ఎప్పుడో ఒకప్పుడు వాటి ఫలితాలు పిశాచాల్లా పైనబడి నెత్తిమీద నాట్యంచేసి తీరుతాయ్! నువ్వు మరచిపోయావేమో! జ్ఞాపకం చేస్తున్నాను. ఎటుచూచినా చీకటి తారాడుతోంది. చలిగాలి మంచుసోనతో కలిసి ఎముకల్ని కొరికి వేస్తోంది. ఆవేళప్పుడు నువ్వు మా అమ్మని యింట్లోనుంచి బయటికి నెట్టేశావు ఆ రాత్రంతా మా అమ్మ అరుగు పైన్నే పడుకుని చలికిగజ గజ వడకి పోయింది. ఇది ఏనాడో జరిగిన దారుణం. ఆదారుణానికి ప్రతికారం ఈనాడు నామూలంగా జరుగబోతున్నదంటే ఈ విషయం వినడానికి ఆశ్చర్యకరంగానే వుండొచ్చు. కానీ ప్రతీకారం మాత్రం అంత తేలిగ్గా వుండదు. కాస్త కఠోరంగానే వుంటుంది

తెప్పపాటు లేని కళ్ళతో నీలకంఠం చక్రపాణిని నివ్వెరపోయి చూడసాగాడు.

ఈ యువకుడి కళ్ళు విస్ఫులింగాల్లా మండుతున్నయ్. తల్లి ఎన్నడో పడిన బాధని జ్ఞప్తికి తెచ్చుకున్నట్టుగాక ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నట్టు మాట్లాడుతున్నాడు. వీడి మాటలు వింటుంటే తన గుండె వుండివుండి జల్లు జల్లు మంటోంది ప్రతీకార వాంఛ రూపొందినట్టున్న వీడేనా తన కుమారుడు?

"అంతేకాదు మా అమ్మ ప్రసవవేదనతో పదరాని బాధ పడుతోంటే ఆమె మానాన ఆమెను వదిలిపెట్టేశావు. పచ్చి బాలెంతరాలి చేత పనులు చేయించి ఆమె ఆరోగ్యానికి చిచ్చు బెట్టావు. ఒళ్లు తెలియని జ్వరంతో ఆమె అలమటించి పోతోంటే వైద్యుడికోసం కబురు పంపించమన్న వాళ్ళని కసిరికొట్టావు. ఇంతా చేసిందెందుకు? నీ కట్నం డబ్బు నీకుముట్టలేదని. కడకు మా మామయ్య మా అమ్మ శవం మీద కుమ్మరించిన వెయ్యి రూపాయల్ని ఏరి యినపెట్టెలో పెట్టుకున్నావు నువ్వు డబ్బుకోసం యినపెఎట్టెనీ మనుషులకోసం వల్లకాటినీ ప్రత్యేకించావు. నువ్వు పాపిష్ఠిడబ్బును మాత్రం చూడగలిగావు. కొట్టినా తిట్టినా మారు పలక్కుండా నీ అడుగులకు మడుగులొత్తిన ఆ నోరులేని యిల్లాలి నిండు బ్రతుకుని కళ్ళజూడలేకపోయావు.

నీలకంఠం కన్నీళ్ళతో నిండిన తన కళ్ళని కొడుక్కి చూపించలేక ముఖం మరో

వైపుకు త్రిప్పుకుంటూ" చాలు బాబూ! మాటల ఈటెలతో నన్ను పొడిచంది చాలు. ఈ శిక్షకు నేను తట్టుకోలేను. అదేదో ప్రతికారమంటున్నావ్. దాన్నే ప్రారంభించు" అన్నాడు.

"ఆ ప్రతీకారమేమిటో తెలుసుకోవాలని వుందికదూ! చెబుతున్నాను. ఈ గదిలోకి ఇంక ఎవరూ రారు. తిండిరాదు. నీళ్ళురాదు. ఏమీ రాదు. డబ్బుమాత్రం కుప్పబోస్తాను. అదే నీకు తిండి. అదే నీకు నీళ్ళు"

నీలకంఠం కళ్ళలోనుంచీ కన్నీరు జలపాతంలా క్రిందికి దూకసాగింది. అతడు నిలువెల్లా కంపించిపోతూ లేచి కూచోపోయి మళ్ళీ పడకపైన్నే పడిపోతూ "ఒరే చక్రపాణి! నేను పాపాత్ముణ్ణి! నువ్వు నన్నేం చేసినా పాపం లేదు. కానీ నువ్వు నా ఎదుట నిలచి నేరాన్ని నాపైన ప్రతిపాదిస్తుంటే నీ మాటల్లో ఒక్కొక్కటీ ఒక్కబాకు పోటులా నన్ను గాయపరుస్తోంది. తిండీ నీళ్ళు లేకుండా నన్ను కృంగి కృశించి నశించిపోనీయ్. ఆకటి బాధకుతోడూ, నేను చేసిన అన్యాయాలని గురించిన స్మృతులతో నన్ను తపించి పోనీయ్. ఈ గదిలోనే నాకు నరకాన్ని సృష్టించు. నేను చనిపోతే నా కోసం ఒక కన్నీటి చుక్కయినా రాల్చకు" అన్నాడు.

చక్రపాణి మంచం దగ్గరికి వచ్చి స్వరాన్ని తగ్గించి "అలా ప్రతీకారంచేసి పగ తీర్చుకోడానికి నేను రాక్షసుణ్ణికాను. నేను మనసులో ఏ ప్రతీకారం అయితే చేయదలచుకున్నానో అది పూర్తయింది. ఇంక నా కిక్కడేం పనిలేదు. నేను వెళ్ళిపోతున్నాను" అని ద్వారం దగ్గరికి వెళ్ళి బిగ్గరగా "ఇక మీరురావచ్చు డాక్టరుగారూ" అంటూ గదిలోనుంచే నిష్క్రమించాడు.

స్టెతస్కోపుతోనూ లెదర్ బ్యాగుతోను లోపలికి వచ్చిన డాక్టరుని చూస్తూ నీలకంఠం "నాకు మందూ గిందూ ఏమీ వద్దు డాక్టర్ గారూ! నాకు నా కుమారుడు కావాలి. వాడి వెళ్ళిపోవద్దని చెప్పండి డాక్టరుగారూ!" అన్నాడు.

కిటికీలోనుంచీ చల్లటివాన గాలిలోపలి వచ్చింది. తెల్లవారినప్పటినుంచీ మూసి మట్టిగొట్టకొనిపోయి లోకాన్నంతా ఉక్కిరి బిక్కిరిచేసిన కారు మేఘాలనుంచీ ఝుల్లుఝుల్లున జడివాన కురవసాగింది. చక్రపాణి ముందుకు పోలేక వీధి కడప దగ్గరే ఆగిపోయాడు.

(ఆంధ్రప్రభ - దిన పత్రిక)

❀ ❀ ❀